Follow: @ANNTELUGU

18-02-2026

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 51 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్

### రికార్డుకు చేరువైన అపర కుబేరుడు

**స్పేస్ ఎక్స్ అధినేత ప్రస్తుత ఆస్తులు 850 బిలియన్ డాలర్లు**

**మహా:** టెక్ దిగ్గజం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్న ఆయన, అతి త్వరలోనే 'తొలి ట్రిలియనీర్' హోదాను దక్కించుకోనున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ముగిసేలోపే మస్క్ ఈ మైలురాయిని చేరుకోనున్నారు. ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 850 బిలియన్ డాలర్లకు చేరింది. ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్కును దాటిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. మస్క్ సంపద ఏ స్థాయిలో ఉందంటే.. ప్రపంచంలోని మరో ముగ్గురు అగ్రశ్రేణి కుబేరుల మొత్తం సంపద కంటే ఇది ఎక్కువ.

మిగతా 2లో

టాప్ న్యూస్

### ఈ నెల 23న తెలంగాణ కేబినెట్ భేటీ

- బడ్జెట్, స్థానిక ఎన్నికలపై కీలక చర్చ



02

### వేలు ముద్రగాళ్లు కూడా సీఎం అవుతారు

- మంత్రి కొండా సురేఖ సంచలన కామెంట్స్



02

### బోరుమన్న ఎర్రబెల్లి

- తొర్రూరు ఓటమితో మాజీ మంత్రి కన్నీళ్ళు
- కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలంటూ ఆవేదన



02

# పట్టణాలకు నవశకం

## మునిసిపాలిటీలపై సీఎం నజర్

నూతన పాలకులకు శిక్షణా కార్యక్రమం

గ్రేటర్ కార్పోరేషన్లపై సమీక్ష.. చెత్తకనపడితే సస్పెండ్ చేస్తా

మల్టీలెవల్ పార్కింగ్... స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి

పురపాలక శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, మహా :** మునిసిపాలిటీలలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఏకపక్ష విజయాలు అందించిన నేపథ్యంలో.. మునిసిపాలిటీలకు కొత్త రూపునిచ్చేదిశగా సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు ప్రారంభించారు. త్వరలో నూతన మునిసిపల్ ఛైర్మన్లు, నూతన మేయర్లతో సమావేశం ఏర్పాటుచేయాలని సీఎస్ ను సీఎం ఆదేశించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని... ఎక్కడైనా చెత్త కనపడితే అధికారులను అక్కడే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు.

మిగతా 2లో




# విజయోత్సాహం

## కాంగ్రెస్ ఖాతాలో మరో ఏడు

మూడు వాయిదా.. ఒకటి బీఆర్ఎస్

తొర్రూరు, జనగామ, కాగజ్ నగర్ హస్తగతం

ఆదిలాబాద్, మెదక్ సహా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ సంబరాలు

క్యాతన్ పల్లిలో మంత్రి వివేక్ కాన్వాయ్ పై దాడి.. ఉద్రిక్తత



**మహా, నెట్ వర్క్ :** రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో జోష్ నెలకొంది. కాంగ్రెస్ కార్యకర్తలు విజయోత్సవాలతో పట్టణాలలో ఉత్సాహాన్ని చాటుకుంటున్నారు. ఆదిలాబాద్ మునిసిపాలిటీని దాదాపు రెండు దశాబ్దాల తర్వాత గెలిచిన కాంగ్రెస్ శ్రేణులు డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ , అసెంబ్లీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మెదక్ పట్టణంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో మెగా ర్యాలీ నిర్వహించారు. ఇక మంగళవారం క్యాతన్ పల్లి మునిసిపాలిటీ ఎన్నిక జరగాల్సి ఉండగా, తీవ్ర ఉద్రిక్తతల నడుమ వాయిదాపడింది. ఓటువేసేందుకు మంత్రి వివేక్, ఎంపీ వంశీ క్యాతన్ పల్లి వస్తుందని మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ వర్గీయులు మంత్రి కాన్వాయ్ పై రాళ్ళు విసిరారు. ఈ సందర్భంగా పలువురికి గాయాలయ్యాయి. దీనిపై బాల్కసుమన్ పై పోలీసుల ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు. ఇక తొర్రూరు మునిసిపాలిటీలో ఎర్రబెట్టి ఆటకట్టించి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాంగ్రెస్ ను గెలిపించారు. జనగామ మునిసిపాలిటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఎంత కాపాడేందుకు ప్రయత్నించినా, ఎక్స్ అఫీషియోతో టై చేసి.. డ్రాలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా గెలిచింది. జనగామ గెలుపులో ఎంపీ చామల కిరణ్ రెడ్డి కీలక భూమిక పోషించారు. ఖానాపూర్ మునిపసిపాలిటీ కోరం లేక వాయిదాపడింది. కాగజ్ నగర్, డోర్నకల్, ఇల్లందు, సుల్తానాబాద్ తదితర మునిసిపాలిటీలను కాంగ్రెస్ గెలుచుకుంది. కోర్టు ఆదేశాలతో ఇబ్రహీంపట్నం మునిసిపాలిటీ ఎన్నిక వాయిదా పడింది.

## జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో ఊహించని ఫలితం చూస్తారు

మునిసిపాలిటీలు అంచనాలకు మించి గెలిచాం

వచ్చే రెండేళ్ళు ఫామ్ హౌజ్ లోనే కేసీఆర్

మీడియాతో మంత్రి పొంగులేటి చిట్ చాట్



**హైదరాబాద్, మహా:** వచ్చే రెండేళ్లు కేసీఆర్ ఫామ్ హౌస్ లోనే కూర్చోవాలని, మునిసిపాలిటీ ఎన్నికల్లో అంచనాలకు మించి విజయం సాధించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి ఏమైనా హడావిడి చేసే అవకాశం ఉంటుందని, అప్పటిదాకా కేసీఆర్ వచ్చేలా లేరన్నారు. సీపీఐ కాంగ్రెస్ పార్టీ మధ్య అన్నదమ్ముల పంచాయతీ మాత్రమేనని, జాతీయ స్థాయిలో మా పొత్తులు ఉన్నాయి.. భవిష్యత్తులోనూ కొనసాగుతాయన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము ఊహించిన దాని కంటే మంచి రిజల్ట్ వచ్చిందని, ప్రతిపక్ష పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన విజయం తమతోనే ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ ఎన్నికలు రెఫరండమ్ అన్నారని, ఫలితాలు రాగానే చేతులెత్తేశారన్నారు. రెండున్నర సంవత్సరాల తమ ప్రభుత్వ పాలనకు మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. రాబోయే జీహెచ్ఎంసి ఎన్నికల్లో ఊహించని ఫలితాన్ని చూస్తారన్నారు.

# నటి ప్రత్యూష మృతి కేసుపై సంచలన తీర్పు

## నిందితుడు లొంగిపోవాలన్న సుప్రీంకోర్టు..

### సిద్ధార్థరెడ్డి.. లొంగిపో.. ఆదేశించిన సుప్రీం

**ఢిల్లీ, మహా :** టాలీవుడ్ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థరెడ్డిని లొంగిపోవాలని ఆదేశించింది. 2002 ఫిబ్రవరిలో అంటే దాదాపు 24 ఏళ్ల కిందట నటి ప్రత్యూష అనుమానాస్పద స్థితిలో చనిపోవడం తెలిసిందే. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థ రెడ్డికి హైకోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గతంలో హైకోర్టు విధించిన రూ.50 వేల జరిమానా కట్టాలని సైతం పేర్కొంది. రెండున్నర దశాబ్దాల క్రితం తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన నటి ప్రత్యూష మృతి కేసులో అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. ప్రత్యూష తల్లి సుమారు 24 ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత, ఈ రోజు (ఫిబ్రవరి 17, 2026) సుప్రీంకోర్టు ఈ కేసులో కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. నిందితుడు సిద్ధార్థ రెడ్డికి విధించిన శిక్షను ఖరారు చేస్తూ, నాలుగు

మిగతా 2లో





## చిన్న పత్రికలపై సర్కారు వివక్షకు నిరసనగా..

### కదం తొక్కిన కలం కార్మికులు

సమాచార భవన్ భవన్ వద్ద జర్నలిస్టుల ఆందోళన

**హైదరాబాద్, మహా :** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఆయా పత్రికల జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన "ఛలో సమాచార భవన్" పిలుపు మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వహకులు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిగతా 2లో

# బోరుమన్న ఎర్రబెల్లి

### తొర్రూరు ఓటమితో మాజీ మంత్రి కన్నీళ్లు

### కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలంటూ ఆవేదన



**మహబూబాబాద్, మహా ;** తొర్రూర్ మున్సిపాలిటీని బీఆర్ఎస్ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బోరుమంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూర్ మున్సిపల్ ఎన్నికల ఉద్రిక్తతల నేపథ్యంలో దయాకర్ రావును నర్సింహుల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎర్రబెల్లి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన గులాబీ కార్యకర్తలకు నేను ఏం సమాధానం చెప్పాలంటూ కన్నీరుమున్నీరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఉండాలా.. వద్దా అని ఎర్రబెల్లి దయాకర్‌రావు కన్నీరు పెట్టుకున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా అధికారులు వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. మెజారిటీ కౌన్సిలర్ స్థానాలు బీఆర్ఎస్ కు దక్కినా అధికార పార్టీ కుట్రలతో అధికార యంత్రాంగం కుమ్మక్కవడం వల్లే తమకు అన్యాయం జరిగిందన్నారు.

**బీఆర్ఎస్ శ్రేణుల నిరసన..**

మరోవైపు.. తొర్రూరు మున్సిపల్ ఆఫీస్ దగ్గర బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్ అఫీషియో మెంబర్‌గా అనర్హురాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ తమను బెదిరించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు.

# నటి ప్రత్యూష మృతి కేసుపై సంచలన తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

వారాల్లోగా సంబంధిత అధికారుల ముందు లొంగిపోవాలని జస్టిస్ రాజేష్ బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

**అసలేం జరిగిందంటే..**

నటి ప్రత్యూష ప్రస్థానాన్ని పరిశీలిస్తే, భువనగిరికి చెందిన ఆమె 1998లో రాయుడు సినిమాతో వెండితెరకు పరిచయమై అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించుకున్నారు. అయితే, కెరీర్ ఎదుగుతున్న దశలోనే 2002 ఫిబ్రవరి 24న కేవలం 20 ఏళ్ల వయసులో ఆమె అనుమానాస్పద స్థితిలో చనిపోవడం అప్పట్లో దుమారం రేపింది. ఫిబ్రవరి 23న ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి విషం తాగి ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ ప్రత్యూష చనిపోయారు. సిద్ధార్థ రెడ్డి మాత్రం కోలుకుని మార్చి 9న డిశ్చార్జ్ అయ్యారు. అతడే స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ హాస్పిటల్ కు వెళ్లడంపై అనుమానాలు ఉన్నాయి.

**రెండేళ్లు జైలుశిక్ష విధించిన హైకోర్టు**

ప్రత్యూష మృతి కేసు ప్రారంభం నుండి అనేక మలుపులు తిరిగింది. ఇది కేవలం ఆత్మహత్య కాదని, ఆమెపై సామూహిక లైంగిక దాడి జరిగిందని, దీని వెనుక రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నారని ప్రత్యూష తల్లి సరోజినీదేవి ఆరోపించారు. కుమార్తె మరణానికి కారకులకు శిక్ష పడాలని సుదీర్ఘ న్యాయపోరాటం చేశారు. తొలుత ఈ కేసును దర్యాప్తు చేసిన సీబీఐ, ఇది ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనగా పేర్కొంటూ సిద్ధార్థ రెడ్డిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. 2004లో సెషన్స్ కోర్టు ఆయనకు ఐదేళ్ల శిక్ష విధించగా, 2011లో హైకోర్టు ఆ శిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చింది.

**న్యాయం కోసం సుప్రీంకోర్టుకు..**

హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అటు సిద్ధార్థ రెడ్డి, ఇటు నటి ప్రత్యూష తల్లి సరోజిని దేవి 2012లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శిక్షను రద్దు చేయాలని సిద్ధార్థ, శిక్షను పెంచాలని సరోజినీదేవి దాఖలు చేసిన పిటిషన్లపై గత ఏడాది నవంబర్‌లో వాదనలు పూర్తయ్యాయి. అయితే తుది తీర్పును రిజర్వ్ చేసింది. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం ప్రత్యూష కేసులో తుది తీర్పు ఇచ్చింది. నిందితుడు 4 వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశిస్తూ, జరిమానా చెల్లించాలని పేర్కొంది. గత 24 ఏళ్లుగా సాగుతున్న ఈ మిస్టరీ కేసులో బాధితులకు న్యాయం లభించింది.

# కీసరగుట్టలో విమాన రథోత్సవ వైభవం

### అధికారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ.. భక్తులతో కలిసిమెలిసి ఉత్సాహం



**కుషాయిగూడ, మహా :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో నాలుగో రోజు నిర్వహించిన శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారి విమాన రథోత్సవం వైభవంగా జరిగింది. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగగా, వేలాది మంది భక్తులు రథోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చారు. అందంగా అలంకరించిన విమాన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి నంది సర్కిల్ మీదుగా జాతర ప్రాంతంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు "హర హర మహాదేవ" నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ వేడుక భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచింది. ఈ సందర్భంగా విధుల నిర్వహణకు వచ్చిన ఏసీపీలు, సీఐలు సహా వివిధ విభాగాలకు చెందిన అధికారులు భక్తులతో కలిసిమెలిసి నృత్యాలు చేస్తూ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. సాధారణంగా కట్టుదిట్టమైన విధుల్లో కనిపించే అధికారులు, భక్తి ఉత్సాహంలో నృత్యాలు వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు కూడా చప్పట్లు కొడుతూ అధికారులను ప్రోత్సహించారు. అంతేకాక, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.

# ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుండి కాపాడుతాం

### కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్



**కుషాయిగూడ, మహా :** ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ సర్వేనెంబర్ 417, 497లలో అక్రమంగా వెలసిన కట్టడాలను తాసిల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఊరుకునేది లేదని కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడమే తమ ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిధవార్లు సత్యనారాయణ రమేష్‌సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఎస్ రావునగర్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు




**కుషాయిగూడ, మహా :** తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినం పురస్కరించుకుని మంగళవారం రాధికా చౌరస్తాలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ చిత్రపటం వద్ద కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి నాయకుడని కొనియాడారు. సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బస్సు కింద పడ్డ వృద్ధురాలు.. చికిత్స పొందుతూ మృతి



**కుషాయిగూడ, మహా :** ఆర్టీసీ బస్సు పైనుంచి వెళ్లిన ఘటనలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విజయ్ కథనం ప్రకారం... కుషాయిగూడ నాగార్జున నగర్ కాలనీ శుభోదయం కాలనీలో నివసించే చిట్యాల లక్ష్మి (64) మంగళవారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు ఈసీఐఎల్ బస్టాండ్కు వచ్చింది. అదే సమయంలో ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి కుషాయిగూడ వైపు వెళ్తున్న టీఎస్ 03 జెడ్ 0324 నెంబర్ గల 281 రూట్ బస్సు ఎక్కేందుకు ముందుకు వచ్చింది. బస్సు ఎక్కే క్రమంలో డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా ముందుకు పోనివ్వడంతో చిట్యాల లక్ష్మీ అదుపుతప్పి కింద పడింది. దీంతో బస్సు చక్రాలు చిట్యాల లక్ష్మి రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో... కాళ్లు నుజ్జై తీవ్ర రక్తస్రావం జరిగింది. ఇక తీవ్రంగా గాయపడిన ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న చిట్యాల లక్ష్మి మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

# చిన్న పత్రికలపై సర్కారు వివక్షకు నిరసనగా..

### కదం తొక్కిన కలం కార్మికులు.. సమాచార భవన్ భవన్ వద్ద జర్నలిస్టుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)



ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐరిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండు రంగారావు, పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు ,హైదరాబాద్ జిల్లా నాయకులు వి.రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, నాయకులు డప్పు రామస్వామి,శంకర్, శివకుమార్,సంజీవ్ కుమార్, మంజులారెడ్డి, సౌభాగ్యవతి, సుష్మిత, శివపార్వతి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, నిజామాబాద్ జిల్లా నేతలు కుంచెం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, యార్వ నరేష్,మహాదేవ్ ప్రసాద్ రాజు, నల్గొండ జిల్లా నాయకులు వెలుతురు యాదయ్య, జీడిమట్ల రవీందర్, నాగయ్య, పరమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.




### కేసీఆర్ జన్మదినం సందర్భంగా

## విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 72వ జన్మదినం సందర్భంగా కాప్రా విభాగం గాంధీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి, తెలుగు-హిందీ-ఆంగ్ల నిఘంటువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామగ్రితో పాటు భాషా పరిజ్ఞానం పెంపొందించే నిఘంటువులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగునూరి మహేష్, కొప్పుల కుమార్, కార్పొరేటర్ అభ్యర్థి గూడా ఇంద్రయ్య, రాజు గౌడ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసి తెలంగాణ తల్లి ఋణం తీర్చుకున్న నాయకుడు అని పేర్కొన్నారు. దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన మహనీయుడిగా, పసి బిడ్డ నుండి పండు ముసలి వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తెలంగాణను దేశంలో అభివృద్ధి, ఆర్థిక రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టిన దూరదృష్టి నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాది భూమిపుత్రుల జాతి

### కేసీఆర్ బర్త్ డే వేడుకల్లో కేటీఆర్



**హైదరాబాద్, మహా:** 'తెగువ ఉన్న, పౌరుషం ఉన్న భూమి పుత్రుల జాతి మాది. అధిష్టానం ఆడిస్తే ఆడే తోలుబొమ్మల జాతి కాదు మాది. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణవాదుల జాతి, రెండోది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. గుర్తుపెట్టుకో రేవంత్..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'జాతి మీద, జాతి గౌరవం మీద ఎవరు పడితే వాళ్లు మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఏ జాతికి నువ్వు జాతి పిత? ఏ జాతి అని మాట్లాడుతున్నావు?.' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాయకుడు కాదు.. ఒక ఉద్యమం పుట్టినరోజు**

'నేడు ఒక నాయకుడి పుట్టిన రోజు కాదు. ఒక ఉద్యమం పుట్టిన రోజు' అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. చరిత్ర పుట్లలో శాశ్వతంగా నిలిచే నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఒక కౌన్సిలర్ పదవి కోసం కాంగ్రెస్, బీజేపీ అక్రమ సంబంధాలు, పొత్తులు చూశామని.. పదవి కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి కలిసిపోయాయని ఆరోపించారు. కానీ.. కేసీఆర్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి పదవులను గడ్డిపోచలుగా త్యాగం చేసి రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. ఓటమి తాత్కాలికమని.. మళ్లీ కేసీఆర్ వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. అనంతరం కేసీఆర్ జన్మదిన వేడుకలు మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్, యువ నాయకుడు తలసాని సాయి కిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 72వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డి, తెలంగాణ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్



**హైదరాబాద్, మహా :** మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటిఏ) వేదికగా 25వ బ్యాచ్ పోలీస్ జాగిలాలు మరియు వాటి హ్యాండ్లర్ల పాసింగ్ అవుట్ పరేడ్ మంగళవారం ఘనంగా జరిగింది. ఎనిమిది నెలల పాటు సాగిన కఠినమైన, శాస్త్రీయ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 105 మంది హ్యాండ్లర్లు, 76 జాగిలాలు ఇప్పుడు విధుల్లో చేరడానికి సిద్ధమయ్యాయి. ఈ బృందంలో తెలంగాణకు చెందిన 42 జాగిలాలు, బీహార్ సీఐడీకి చెందిన 30, సీఐఎస్ఎఫ్ కు చెందిన 4 జాగిలాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఈ జాగిలాలు కేవలం జంతువులు మాత్రమే కావని, నేర పరిశోధనలో పోలీసులకు అత్యంత నమ్మకమైన మరియు క్రమశిక్షణ కలిగిన భాగస్వాములన్నారు. జాగిలాలకు, హ్యాండ్లర్లకుమధ్యలో ఉన్న అవగాహనను బట్టి శిక్షణ మెరుగ్గా ఉంటుందన్నారు. నేరస్థులను వేటాడటం, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను గుర్తించడం, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని, వీటి రాకతో పోలీసు శాఖ సామర్థ్యం మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణను సమర్థవంతంగా నిర్వహించిన ట్రైనింగ్ అకాడమీ అధికారులను సిబ్బందిని అడిషనల్ డీజీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యూ, ఓఎస్‌డీ వి.బి. కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ, 2004లో ప్రారంభమైన ఈ శిక్షణ కేంద్రం నేడు దేశస్థాయిలో అత్యుత్తమ ప్రమాణాలతో పోలీస్ శిక్షణ సంస్థగా గుర్తింపు పొందిందని ప్రకటించారు. ఇప్పటివరకు ఈ అకాడమీ ద్వారా వివిధ రాష్ట్రాలకు చెందిన 919 పోలీస్ జాగిలాలు, 1310 మంది హ్యాండ్లర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా 67వ మరియు 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లలో తెలంగాణ పోలీస్ విభాగం వరుసగా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకోవడం ఇక్కడి శిక్షణ నాణ్యతకు నిదర్శనమని గుర్తుచేశారు. జాగిలాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 650 గజాల 'కెనైన్ ఆల్ఫాక్షన్ పార్క్', అత్యాధునిక వెటర్నరీ ఆస్పత్రి వంటి వసతులు వీటి ఆరోగ్యం మరియు పనితీరును మెరుగుపరుస్తాయని ఆయన వివరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు. ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో సీఐఎస్ఎఫ్ కు చెందిన వి. భాస్కర రావు (జాగిలం లియో), నార్కోటిక్ విభాగంలో బీహార్ సీఐడీకి చెందిన సుదర్శన్ కుమార్ (జాగిలం చార్లీ), ట్రాకర్ విభాగంలో రామగుండంకు చెందిన ఎం. శ్రీనాథ్ (జాగిలం రాకీ) ప్రథమ బహుమతులు సాధించారు. ఫిజికల్ పెర్ఫార్మెన్స్ టెస్టులో కరీంనగర్ కు చెందిన బి. నితిన్ మొదటి స్థానంలో నిలవగా, వివిధ బ్రీడ్‌ల అజిలిటీ విభాగంలో సింతు కుమార్, బి. కృష్ణ, విశాల్ కుపాలే, వి. కుమారస్వామి, బి. నరేష్ బాబు తమ జాగిలాలతో ప్రతిభ చాటారు. అలాగే కే. సంతోష్ రాకల, పి. గోపి, బాబితా కుమారి తదితరులు కన్సోలేషన్ బహుమతులు అందుకోగా, ఎం. సురేష్‌రెడ్డి పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. ఇంటెలిజెన్స్ ఐజిపి కార్తికేయ, ఎస్పీలు అపూర్వరావు, కరుణాకర్, చక్రవర్తి అకాడమీ ట్రైనింగ్ కన్సల్టెంట్ మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

### ఈ నెల 23న

## తెలంగాణ కేబినెట్ భేటీ

### బడ్జెట్, స్థానిక ఎన్నికలపై కీలక చర్చ

**హైదరాబాద్, మహా :** ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం కానున్న మంత్రివర్గం కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోబోతోంది. ముఖ్యంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మంత్రులు చర్చించనున్నారు. అలాగే జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలను దక్కించుకున్న వైనంపై కూడా మంత్రి వర్గం చర్చించనుంది. రానున్న కాలంలో పరిపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజా అభిప్రాయాలకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలను కూడా సమావేశం చర్చించనుంది. గత మంత్రివర్గ సమావేశం ములుగు జిల్లా మేడారంలో జరిగిన విషయం తెలిసిందే.

### పట్టణాలకు

# నవశకం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలోని పార్కుల వివరాలు సేకరించాలని.. వాటి అభివృద్ధి పైన ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.

**నూతన పాలకులకు శిక్షణ**

రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు.. ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లతో త్వరలోనే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇతర అంశాలను వివరించాలని సూచించారు. తాను సమావేశానికి హాజరై నూతనంగా ఎన్నికైన వారితో మాట్లాడాతానని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేలు ముద్రగాళ్లు కూడా

# సీఎం అవుతారు

### మంత్రి కొండా సురేఖ సంచలన కామెంట్స్

**సిద్దిపేట, మహా:** మంత్రి కొండా సురేఖ సంచలన కామెంట్స్ చేశారు. మంగళవారం సిద్దిపేట ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన 10వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని మాట్లాడారు. 'తాము రాజకీయ నేతలం..రాజకీయాల్లో వేలు ముద్రగాళ్లు కూడా సీఎం అవుతారు. ఎంతో కష్టపడితే కానీ ఐఏఎస్, ఐపీఎస్‌లు కాలేరు. ఎంత కష్టపడి ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినా చివరికి మేం చెప్పింది వినాల్సివస్తుంది' అని కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా

# ఎలాన్ మస్క్



(మొదటిపేజీ తరువాయి)

లారీ పేజ్ (గూగుల్): 251 బిలియన్ డాలర్లు, సెర్గీ బ్రిన్ (గూగుల్): 231 బిలియన్ డాలర్లు, మార్క్ జుకర్‌బర్గ్ (మెటా): 219 బిలియన్ డాలర్లు.. ఈ ముగ్గురి మొత్తం సంపద 701 బిలియన్ డాలర్లు కాగా మస్క్ ఒక్కరి సంపదే 850 బిలియన్ డాలర్లు కావడం విశేషం.

**ట్రిలియన్ మార్కుకు చేర్చే 'స్పేస్ ఎక్స్ – ఎక్స్ ఏఐ' డీల్**

మస్క్ సంపద ఇంత వేగంగా పెరగడానికి ఇటీవల జరిగిన ఒక భారీ ఒప్పందమే ప్రధాన కారణం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్ ఏఐని స్పేస్ ఎక్స్ 1.25 ట్రిలియన్ డాలర్లతో కొనుగోలు చేసింది. విలీనమైన ఈ కొత్త సంస్థలో మస్క్‌కు 43 శాతం వాటా ఉంది. దీని విలువ సుమారు 530 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీనికి అదనంగా త్వరలోనే స్పేస్ ఎక్స్ సంస్థ ఐపీఓ ద్వారా సుమారు 25 బిలియన్ డాలర్లను సమీకరించాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ విజయవంతమైతే, మస్క్ నికర విలువ ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది.

## క్రీడలు విద్యార్థులలో మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** తెలంగాణ రాష్ట్రం గుర్తింపు పొందిన ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో వార్షిక క్రీడలను మైలార్ దేవ్ పల్లి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్రీడా పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృత కార్యక్రమాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో జట్టుకట్టే తత్వం, నాయకత్వ లక్షణాలు ఓటమిని స్వీకరించే ధైర్యం అలవడతాయని ఆయన తెలిపారు. ప్రవేట్ విద్యాలయాలు విద్యా ప్రమాణాలను పెంచడంతో ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రవేట్ విద్య సంఘం ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, ప్రేమ్ గౌడ్, బాబురావు, శ్రీనివాస్ రెడ్డి, భాషా శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రాము, రాజు, రఘు, శేఖర్, కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘంలో సభ్యులుగా చేరండి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



**మొయినాబాద్ మహా:** మండల పరిధిలోని నాగిరెడ్డి గూడ గ్రామంలో అమావాస్య సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం భవన నిర్మాణ కార్మిక సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షులు ముంజగళ్ళ ప్రభుదాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లీ దేవేందర్ హాజరై మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై నిరంతరం సిఐటియు పోరాటం చేస్తుందని అన్నారు. భవనిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉందని కార్మికులందరూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్డు ఉంటే కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వెల్ఫేర్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందుతుందని అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు సిఐటియు సభ్యులుగా చేరాలని లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్,భవన నిర్మాణ కార్మిక సంఘం నాగిరెడ్డిగూడ గ్రామ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు కర్ర వెంకటయ్య, జీనుగుంట అశోక్, మహేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదిన వేడుకలు

### నల్లగొండలో ఘనంగా కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి..
### అభివృద్ధికి కేసీఆర్ కేరాఫ్ అడ్రస్.. కాంగ్రెస్ పాలనలో కుంటుపడ్డ సంక్షేమం..



**నల్లగొండ మహా :** తెలంగాణ జాతిపిత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదిన వేడుకలు మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు మరియు కార్యకర్తల జయజయధ్వానాల మధ్య మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ రోజని కొనియాడారు. అకుంఠిత దీక్షతో ప్రాణాలకు తెగించి పోరాడి ఢిల్లీ పాలకుల మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన అపర భగీరథుడు కేసీఆర్ అని ప్రశంసించారు. స్వరాష్ట్రంలో సాగునీటి కోసం కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలతో వ్యవసాయాన్ని పండుగ చేశారని గుర్తుచేశారు.మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, వృద్ధులకు ఆసరా పెన్షన్ల వంటి పథకాలతో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనని అన్నారు. ఐటీ మరియు పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పాలనపై విమర్శలు..**

గత రెండున్నర ఏళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కంచర్ల విమర్శించారు. సంక్షేమ పథకాలు అటకెక్కాయని, రైతులు, మహిళలు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్బండ వర్గాల ప్రజలు మళ్ళీ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి పదవి చేపట్టి ప్రజల ఆశలు నెరవేర్చాలని ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.జన్మదిన వేడుకల్లో భాగంగా ఉదయం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో రోగులకు వారి బంధువులకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, చీరా పంకజ్ యాదవ్, రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, పార్టీ కార్యదర్శి నిరంజన్ వలి, మాజీ ఆర్.ఓ మాలే శరణ్య రెడ్డి, రేగట్టె మల్లికార్జున రెడ్డి, మందడి సైదిరెడ్డి, ఎస్కే కరీం పాషా, కంచనపల్లి రవీందర్ రావు, లొడంగి గోవర్ధన్, దేప వెంకటరెడ్డి, సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, మారగోని గణేష్ పాల్గొన్నారు. అలాగే కార్పొరేటర్లు గోపగోని స్వాతి రాజశేఖర్, పెరిక యాదయ్య, దొడ్డి రమేష్, రత్నగిరి శ్రీనివాస్, కుందూరు ప్రవీణ్ రెడ్డి, మరియు నాయకులు రావుల శ్రీనివాసరెడ్డి, గుండ్రెడ్డి యుగంధర్ రెడ్డి, అక్కినేపల్లి కన్నారావు, సయ్యద్ జాఫర్, విద్యార్థి నాయకుడు బొమ్మరబోయన నాగార్జున తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు



## ప్రజలకు అందుబాటులో ఉండాలి

**మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్**

**ఆమనగల్లు, మహా :**ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన పత్యనాయక్ ను మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయన శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాములు నాయక్ మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండి నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, రాగ్య నాయక్, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, సురేష్ నాయక్, నాజర్, శ్రీను నాయక్, విజేందర్, రఫీ, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## కెసిఆర్ పుట్టినరోజు వేడుకల్లో వికలాంగులకు ఎలక్ట్రికల్స్ సైకిల్స్ పంపిణీ



**రాజేంద్రనగర్ మహా ;** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కొన్నమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్య లో నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు.అనంతరం వికలాంగులకు ఎలక్ట్రిక్ సైకిల్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గాందేయ మార్గంలో తెలంగాణను సాధించిన కెసిఆర్ చరిత్రలో నిలిచిపోతారు. తెచ్చిన తెలంగాణను 10 ఏళ్ల కాలంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాడని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక తెలంగాణ రాష్ట్రం రావణకాష్టంలా మారిందని బిఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ ప్రదర్శిస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులుమంచర్ల శ్రీనివాస్ ,.బుచ్చి రెడ్డి, రాజేందర్, మోహన్ రావు.జయసింహ, ప్రదీప్ రెడ్డి, దీప మల్లేష్,పరందాములు,బుర్కుంట సతీష్, అశోక్, హన్మంతు, మురళి గౌడ్, సాగర్, విజయ్, సుదర్శన్ గౌడ్, శైలేష్, రాజు గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు



## ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి

- గడువులోగా సవరణ ప్రక్రియ పూర్తి కావాలి..
- బీఎల్వోల ఖాళీలను తక్షణమే భర్తీ చేయండి..
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్షించిన కలెక్టర్ చంద్రశేఖర్

**నల్లగొండ మహా :** ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) బి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బీఎల్వో (BLO) పోస్టులు ఖాళీగా ఉంటే తక్షణమే భర్తీ చేయాలని ఆదేశించారు. ఈఆర్వోలు ప్రత్యేక దృష్టిసారించి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన గడువులోగా రివిజన్ పనులను ముగించాలని దిశానిర్దేశం చేశారు.

**అస్పష్టమైన ఫోటోలకు స్వస్తి..**

అంతకుముందు సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో నాణ్యత పెంచాలని సూచించారు.జాబితాలో బ్లర్ (Blur), చిన్నవిగా ఉన్న ఫోటోలను గుర్తించాలని, ఫారం8 ద్వారా ఓటర్ల నుండి స్పష్టమైన ఫోటోలను సేకరించి అప్‌డేట్ చేయాలన్నారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వచ్చే వారంలోగా స్పష్టమైన పురోగతి కనిపించాలని ఆదేశించారు.బీఎల్వోలు సూపర్వైజర్ల సమన్వయంతో ఇంటింటి సర్వేను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్చార్జ్ డి.ఆర్.ఓ వై. అశోక్ రెడ్డి, ఆర్డీఓలు శ్రీదేవి, రమణా రెడ్డి, స్పెషల్ ఈఆర్వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



## ప్రకాశం బజార్‌కు ట్రాఫిక్ కష్టాలు తీరుస్తాం..

- నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం..
- తెల్లవారుజామున 4 గంటలకే క్షేత్రస్థాయి పర్యవేక్షణ..
- చిరు వ్యాపారులకు పాత కలెక్టరేట్ వద్ద స్థలాల కేటాయింపు..
- రోడ్లపై ఉన్న డివైడర్ల తొలగింపునకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం..



మంత్రి మానవత్వం రూ. 30 వేల పండ్లు కొనుగోలు..

**నల్లగొండ మహా :** నల్లగొండ పట్టణాన్ని సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అందులో భాగంగా పట్టణానికి గుండెకాయ వంటి ప్రకాశం బజార్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకే ఆయన లతీఫ్ సాబ్ గుట్ట, ప్రకాశం బజార్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రకాశం బజార్‌లోని ఫుట్‌పాత్‌లపై పండ్లు, పూల వ్యాపారం చేసుకునే వారు డివైడర్ల మధ్య షాపులు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని మంత్రి పేర్కొన్నారు. పేద వ్యాపారులకు అన్యాయం జరగనివ్వం.. వారికి ప్రత్యామ్నాయం చూపుతాం అని మంత్రి హామీ ఇచ్చారు. సుమారు 70 మంది చిరు వ్యాపారులను గుర్తించి వారికి పాత కలెక్టరేట్ స్థలంలో షాపు పరిమాణాన్ని బట్టి 50 నుండి 100 గజాల స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. అక్కడ సీసీ రోడ్లు మార్కింగ్ వేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. స్థానిక పండ్ల వ్యాపారి గులాం ఖాదర్ వద్ద అప్పటికప్పుడే రూ. 30 వేలు చెల్లించి పండ్లను కొనుగోలు చేసి అక్కడున్న వారందరికీ పంపిణీ చేశారు. పేదల పక్షాన ఎప్పుడూ తాను ఉంటానని ఈ సందర్భంగా ఆయన వ్యాపారులకు భరోసా ఇచ్చారు.ప్రకాశం బజార్‌లో ప్రస్తుతం ఉన్న డివైడర్లను జేసీబీల సహాయంతో వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు. సాయంత్రం లోపు ఈ పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. అలాగే పాత కలెక్టరేట్ వద్ద ఉన్న డీసీఎం వాహనాల పార్కింగ్‌ను దేవరకొండ రోడ్డులోని హౌసింగ్ బోర్డు స్థలానికి తరలించాలని, ప్రకాశంబజార్‌లో భూగర్భ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సిసి రోడ్లు వేసి ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలన్నారు. గతంలో జనాభా తక్కువగా ఉన్నప్పుడు ఇబ్బంది ఉండేది కాదని ఇప్పుడు నిత్యం 10 వేల మందికి పైగా సందర్శిస్తుండటంతో రద్దీ పెరిగిందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరామిరెడ్డి, మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాలు, రాజకీయాలుగానే ఉండాలి

- చైర్మన్ క్లినిక్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ క్లినిక్ పై దాడి చేసిన బిఆర్ఎస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమనగల్లులో చైర్మన్ ను ఆయన పరామర్శించి దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులకు తాము లేదని, ప్రజాసేవ చేయాలన్న ఆయన దృక్పథాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఆదరించి రాజ్యాంగ బద్ధంగా చైర్మన్ ను చేస్తే ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు కక్ష సాధింపు చర్యలకు దిగి దాడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. కష్టకాలంలో బిఆర్ఎస్ జెండాను మోసినందుకు దాడి చేశారా, బిఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తే వారిపై ఎందుకు దాడి చేయలేదని ఆయన ప్రశ్నించారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసి చైర్మన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని లేనిపక్షంలో జాతీయ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ నాయక్, రాగ్య నాయక్, శ్రీను నాయక్, మల్లేష్, విజయ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తి దారుణ హత్య..



**మొయినాబాద్ మహా:**ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బండరాయితో మోది దుండగులు దారుణంగా చంపేశారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ సురేష్ వృత్తి వ్యాపారం, మంగళవారం ఉదయం 9 గంటలకు అతని వాట్సాప్ లో కాసింబౌలి శివారులో గుర్తు తెలియని మృతదేహం అంటూ రావడంతో కాశింభౌలి గ్రామంలోనీ శివారు ప్రాంతానికి వెళ్లి చూడగా.. ముదిగొండ సురేష్ వద్ద స్థానిక భాస్కర్ ఆసుపత్రిలో హౌస్ కీపింగ్ సూపర్వైజర్ గా పనిచేసే భోగినేని యోగేశ్వర్ గా గుర్తించారు. భోగినేని యోగేశ్వర్ తండ్రి పేరు ముత్తయ్య వయస్సు (34) ముదిగొండ సురేష్ వద్ద విధుల్లో చేరి 10 రోజులు అవుతుందని, అతడు తన భార్యతో సురంగల్లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. సోమవారం రాత్రి కశింబౌలి శివారు ప్రాంతంలో భోగినేని యోగేశ్వర్ ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోది దారుణంగా చంపేశారని గుర్తించారు. సమాచారం అందుకున్న ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి ఎస్సైలు నరసింహారావు, వెంకన్న, నహీముద్దీన్లు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# సుపరిపాలనతోనే ప్రజలకు చేరువ..

- అభివృద్ధి సంక్షేమ ఫలాలు పేదలకు అందాలి..
- పాలనలో దక్షత పెంచుకోవాలి కలెక్టర్ బి. చంద్రశేఖర్..
- జిల్లాలో గ్రూప్-1 ప్రొబేషనరీ అధికారులతో క్షేత్రస్థాయి అధ్యయనం



**నల్లగొండ మహా :** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల దరి చేర్చడంలో అధికారులు పాలనా దక్షతను చాటుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (MCRHRD) ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 54 మంది ప్రొబేషనరీ గ్రూప్1 అధికారులు మంగళవారం నల్లగొండ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారితో నిర్వహించిన భేటీలో కలెక్టర్ జిల్లా ముఖచిత్రాన్ని పాలనా తీరును వివరించారు.నల్లగొండ జిల్లా భౌగోళిక పరిస్థితులపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 16.18 లక్షల జనాభా కలిగిన ఈ జిల్లాలో 77 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని సాగర్ ఆయకట్టు నుంచి మారుమూల గిరిజన ప్రాంతాల వరకు విభిన్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రొబేషనరీ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి ప్రజల జీవన విధానంపై సమగ్ర నివేదికలు తయారు చేసుకోవాలి. ఇది మీ భవిష్యత్తు కెరీర్‌కు ఎంతో కీలకం అని ఆయన పేర్కొన్నారు.

**పారదర్శక పాలన దళారీ వ్యవస్థకు చెక్..**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును కలెక్టర్ ప్రశంసించారు.రైతు భరోసా, రైతు బీమా, పెన్షన్ల వంటి పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందని వివరించారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి వంటి వినూత్న పథకాలతో మహిళా సాధికారతకు బాటలు పడుతున్నాయన్నారు. ఈ పథకాల అమలులో ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేదని, ఈ పారదర్శకతను అధికారులు అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు.

**రెండు రోజుల పర్యటన ఈ గ్రామాల్లోనే..**

శిక్షణలో భాగంగా అధికారులు బుధవారం కూడా జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. చెన్నమనేనిపల్లి (కొండమల్లేపల్లి), ఆర్ఆర్ గూడెం (పీఏపల్లి), గొల్లపల్లి (చింతపల్లి), మైనంపల్లి, తూర్పుపల్లి (దేవరకొండ), శెట్టిపాలెం, లక్ష్మీదేవి గూడెం (వేములపల్లి), శ్రీనివాస్ నగర్, యాద్గార్ పల్లి (మిర్యాలగూడ).ఈ గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డి.ఆర్.డి.ఓ. శేఖర్ రెడ్డి, ఎం.సి.హెచ్.ఆర్.డి. కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత కేసీఆర్



**ఆమనగల్లు, మహా :**తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండల ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.బర్త్ డే కేకును కట్ చేసి కార్యకర్తలు,నాయకులు కేసీఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలోనే నెంబర్వన్ సీఎంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో నడిపించారని , సంక్షేమ పథకాలలో స్వర్ణయుగాన్ని తలపించేలా తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించాన్నారు . కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఆంధ్ర పాలకుల చేత నష్టపోతున్న తెలంగాణ ప్రజానీకానికి ప్రత్యేక రాష్ట్రం సాధించి విముక్తి కలిగించిన వ్యక్తి కేసీఆర్అని అన్నారు. సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ అధ్వర్యంలో ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణ సంచాలు పేల్చి, కేక్ కటింగ్ చేసి కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నూతన కౌన్సిలర్లు దుద్దు ఆంజనేయులు యాదవ్, ఏనుమల రమేష్, నాగిళ్ళ జగన్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు లకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచ్ శ్రీను నాయక్ , మాజీ సర్పంచ్ ఈశ్వర్ నాయక్ మాజీ కౌన్సిలర్ కమటం వెంకటయ్య,కౌన్సిలర్లు భాగ్యమ్మ రఘు, ఆంజనేయులు,రమేష్,నాగిళ్ల జగన్,విక్రం,శ్రీశైలం, అనూష,, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్,సైదులు గౌడ్, కోట శీను, బాలస్వామి, శంకర్,జంగయ్య, కొమ్ము ప్రసాద్,శివకుమార్,యాదయ్య,గపి,మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా..

**హైకోర్టు ఆదేశాలతో ఎన్నిక వాయిదా ఆర్డిఓ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే తదుపరి ఎన్నిక**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను హైకోర్టు ఆదేశాలతో వాయిదా వేయడం జరిగిందని ఆర్డిఓ అనంతరెడ్డి వెల్లడించారు. తదుపరి ఎన్నిక ప్రక్రియను కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటామని, హై కోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ ఫోన్ చేసి చైర్మన్ ఎన్నికపై స్టే విధించడం జరిగిందని తెలుపడంతో, ఎన్నికల ప్రక్రియ మధ్యలో నిలిపివేయడం జరిగిందని, తదుపరి నిర్ణయం హైకోర్టు సూచనల ప్రకారం జరుగుతుందని, మంగళవారం జరిగిన చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు తెలియజేయడం జరుగుతుందని, ఈ యొక్క ఎన్నిక ప్రక్రియను తిరిగి ఈనెల 20వ తారీకున రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. చైర్మన్ ఎన్నికలో పాల్గొన్న సభ్యులు 23 మంది సభ్యులు మున్సిపల్ కార్యాలయం నుంచి వెళ్లడం జరిగింది. 19వ వార్డు సభ్యులు ఆకుల యాదగిరి పోలీసుల అదుపులో ఉండడం జరిగింది. 19 వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు అనంతరం హైకోర్టును ఆశ్రయించారు. అనూహ్యంగా మంగళవారం జరిగిన ఎన్నికకు హాజరైన ఆకుల యాదగిరిని అదుపులోకి తీసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులను, హై కోర్టులో హాజరు పరచాల్సిందగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసి నందున, నేడు ఉదయం ఎస్హెచ్ఓతో కలిసి హైకోర్టులో హాజరు పరచాలని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో సునీత, మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల భద్రత కోసం విస్తృత చర్యలు తీసుకోవాలి

**-ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్**



**ఆమనగల్లు, మహా :** తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన న్యాయవాదుల ప్రొటెక్షన్ ఏర్పాటు పై చర్చ సమావేశంలో ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ పాల్గొని మాట్లాడారు. న్యాయవాదుల మీద శారీరక దాడులు, భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రతను పెంచేందుకు విస్తృత చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం న్యాయవాదుల భద్రతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి దానిని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించాలని సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముక్త కంఠంతో తీర్మానించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్

18-02-2026





# ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సంబరాలు

## మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష విజయోత్సవ ర్యాలీ

### పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు.. ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానన్న చైర్ పర్సన్ మద్దతిచ్చిన కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన అనూష



**ఆదిలాబాద్, మహా :** సెక్యులర్ పార్టీల మద్దతుతో మున్సిపల్ పీఠం గెలుచుకున్నామని మతోన్మాద పార్టీకి షాకిచ్చామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు.మంగళవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్ బండారి అనూష విజయోత్సవ ర్యాలీలో కీలక నేతలందరితో కలిసి వారు పాల్గొన్నారు.అటు తనకు పదవి కట్టబెట్టిన బీఆర్ఎస్, ఎంఐఎం,స్వతంత్ర కౌన్సిల్ సభ్యులకు, ప్రజలకు కీలక పాత్ర పోషించిన నేతలకు అనూష కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లగుండా కొనసాగింది. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల జై కాంగ్రెస్ నినాదాలతో ర్యాలీ ఆసాంతం దద్దరిల్లింది. ర్యాలీ పొడువునా వాహనం పై నుండి మున్సిపల్ చైర్ పర్సన్ అనూష ప్రజలకు అభివాదం చేసారు. కాంగ్రెస్ శ్రేణులు కంది శ్రీనివాస రెడ్డిని అభిమానంతో తమ భుజానికెత్తుకుని నృత్యాలు చేసారు. ఆయన సైతం కండువా ఊపుతూ ఉత్సాహపరిచారు.పట్టణంలోని ప్రధాన కూడళ్ళ గుండా శ్రేణులు కాంగ్రెస్ జెండాలు ఊపుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.















## ఘనంగా టీజీ మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్ అధినేతకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రత్యేక పూజలు
- మాజీ ఎమ్మెల్యే రేగా ఆధ్వర్యంలో కార్యక్రమాలు



**మణుగూరు, మహా :**తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన టీజీ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని మంగళవారం మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలయలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు నేతృత్వంలో స్థానిక సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రదాతగా నిలిచిన కేసీఆర్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం..

- నిరుపేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలి..
- రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ తెలిపారు. నిరుపేద మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.జిల్లా కాంగ్రెస్ నాయకుడు గురజాల గోపి ఆధ్వర్యంలో, ఆయన తల్లిగారు కీర్తిశేషులు గురజాల లక్ష్మీ జ్ఞాపకార్థం ఈ ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతురాలైన శిక్షకురాలి ఆధ్వర్యంలో మార్చి 8న శిక్షణ ప్రారంభమవుతుందని వెల్లడించారు.శిక్షణకు ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో కలిసి ఫిబ్రవరి 25 నుండి మార్చి 5వ తేదీ లోగా రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మూడు నెలలపాటు జరిగే ఈ శిక్షణ అనంతరం పాల్గొనేవారికి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు.నేటి సమాజంలో మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, స్థానిక నిరుపేద మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, సౌజన్య దాకూరి, లక్కీశెట్టి హేమలత, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**జూలూరుపాడు, మహా:** బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కెసిఆర్) 72వ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు చాపలమడుగు రామ్మూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ముఖ్య అతిధులుగా పాల్గొని, పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా 12 ఏళ్లు శాంతియుత మార్గంలో అలుపెరుగని పోరాటాలు చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి, కరువు నేలను సిరుల తెలంగాణగా మార్చి దేశంలోనే తెలంగాణను ప్రథమ స్థాయిలో నిలిపారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుద్దుకూరి నాగేశ్వరరావు, యదలపల్లి వీరభద్రం, మూడు చిట్టిబాబు, మాజీ వైస్ ఎంపీపీ సీతాకుమారి, మహిళా నాయకురాలు ధరావత్ దేవిక, ఉప సర్పంచులు బాదావత్ నరేష్, బత్తుల అశోక్, రెడ్డిబోయిన రాము, తాళ్లూరి రామారావు, పురస్తపు రవు రామకృష్ణ, పోతురాజు రామారావు, బుడిపూడి ప్రతాప్, తాళ్లూరి నవీన్, రాయపాటి వెంకటేశ్వర్లు, మార్కాపురి నరసింహారావు, చెంగల నరసింహారావు, ఇల్లంగి తిరుపతి, లకావత్ హేమ్లు, బోడా భోజ్య, మాచిన్ని శేషగిరిరావు, పోగుల నాగభూషణం, బోడా దేవా, బానోత్ బిక్కు, బానోత్ చందర్, కిన్నెర నరసింహారావు, హరిలాల్, మోహన్, హనుమంతరావు, కుంజా రవికుమార్, దొడ్డ చలపతి, ఈసం వెంకటేశ్వర్లు, బచ్చల వంశీ, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**అశ్వారావుపేట, మహా :** అశ్వారావుపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అశ్వారావుపేటలో కాసాని చంద్రమోహన్ నివాసంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్లుగా గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పోటీ చేసిన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని సూచించారు. ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జుజ్జూరి వెంకన్న బాబు, టౌన్ పార్టీ అధ్యక్షురాలు సత్యవరపు సంపూర్ణ, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి, కాసాని చంద్రమోహన్, కాసాని నాగ శేష పద్మ, జూపల్లి రమణరావు, వ్యాపార వర్గాల సంఘం అధ్యక్షుడు సంక ప్రసాద్, ప్రకాశ్ రావు, రవి కిరణ్, వగ్గెల పూజ, మాజీ జిల్లా పరిషత్ సభ్యురాలు సున్నం నాగమణి, నారం రాజశేఖర్, మోటూరి మోహన్, బాలి కిరణ్, సోమని రమేష్, ఆరేపల్లి గోవింద్, చిక్కం మాధురి, చిక్కం గోపాలకృష్ణ, స్వరూప, లక్ష్మీ, సుమలత, పార్వతి, నవీన్, గంగాధర్, ధర్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీల బీభత్సం..

**రహదారులు దెబ్బతిని పంటలకు ఇబ్బందులు.. కమలాపురం రైతుల ఆవేదన.. మణుగూరు డీఎస్పీ, తహసీల్దార్‌లకు వినతి**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో ఇసుక లారీల రాకపోకలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై మంగళవారం గ్రామస్తులు, రైతులు కలిసి మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ అద్దంకి సురేష్‌లకు వినతిపత్రం అందజేశారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, రోజూ వందల సంఖ్యలో ఇసుక లారీలు గ్రామం పక్కనుంచి వెళ్లడం వల్ల భారీగా దుమ్ము ఎగసిపడి ఇళ్లపై పడుతోందని, ప్రజలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా, పంట పొలాలకు వెళ్లే రహదారిని ఇసుక లారీలు పూర్తిగా ఆక్రమించడంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు.గత నాలుగేళ్లుగా ఇసుక కాంట్రాక్టర్లు తమ లారీలను పంట పొలాల రహదారిపై నిలిపివేస్తూ రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. లారీల బరువుతో రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా రైతులు పొలాలకు వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా, కొంతమంది లారీ డ్రైవర్లు, క్లీనర్లు మద్యం సేవించి సీసాలను పంట పొలాల్లో పగలగొడుతున్నారని, గాజు ముక్కల వల్ల రైతులకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పంట పనులకు వెళ్లే రైతులు గాయపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఈ సమస్యలను తక్షణమే పరిశీలించి గ్రామస్తులకు, రైతులకు న్యాయం చేయాలని డీఎస్పీ, తహసీల్దార్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రావులపల్లి రామమూర్తి, నర్రా దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, ప్రసాద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.3.43 లక్షలు

**శివరాత్రి సందర్భంగా భక్తుల విరాళాల వెల్లువ**

**మణుగూరు, మహా :**మణుగూరులోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఈవో పర్యవేక్షణలో గ్రామ పెద్దలు, సేవా సభ్యులు మంగళవారం లెక్కించారు.హుండీ ద్వారా రూ.1,31,519 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అభిషేకాలు, షాపులు, ఇతర పూజల ద్వారా రూ.1,17,625, దర్శనం టికెట్ల ద్వారా రూ.94,300 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. మొత్తం అన్ని రకాలుగా కలిపి స్వామి వారి దేవస్థానానికి రూ.3,43,444 ఆదాయం వచ్చినట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడి బాబు మాట్లాడుతూ, భక్తుల విశేష సహకారంతో శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి భక్తుల సహకారం మరింత అవసరమని ఆయన కోరారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ ఈవో ఎన్ శేషయ్య, కొత్తగూడెం డివిజన్ ఇన్స్పెక్టర్ బేల్ సింగ్, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.భక్తుల విశేష స్పందనతో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.



## జర్నలిస్ట్ కప్-2026కు ఎమ్మెల్యే పాయం డీఎస్పీకి ఆహ్వానం అందించిన జర్నలిస్టులు

**పినపాక ,మహా:** పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్ట్ కప్-2026 క్రికెట్ టోర్నమెంట్ కు ఆహ్వానం అందజేశారు. పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ జర్నలిస్టులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్య స్నేహభావం, క్రీడాస్ఫూర్తి మరియు ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులు తమ వృత్తి బాధ్యతలతో పాటు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి దిశానిర్దేశం చేసే వర్గమని, వారిలో ఐక్యత మరియు సత్సంబంధాలు పెంపొందించేందుకు ఇటువంటి క్రీడా కార్యక్రమాలు అవసరమని అన్నారు. టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఓసి మక్ రిమూవల్ టెండర్ వేగవంతం చేయాలి

- 17 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి భరోసా కల్పించాలి
- ఐఎఫ్‌టీయూ డిమాండ్




**మణుగూరు, మహా :**గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన మణుగూరు ఓసి మక్ రిమూవల్ టెండర్ ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి, ఉపాధి కోల్పోయిన 17 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ డి నాసర్ పాషా సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం జీఎం కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ఓసి మక్ రిమూవల్ టెండర్ పనిలో 17 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉపాధి పొందుతున్నారని, వీరిలో సింగరేణి భూ నిర్వాసితులు కూడా ఉన్నారని తెలిపారు. టెండర్ రెన్యువల్ ప్రక్రియ స్తబ్ధతకు గురికావడంతో నాలుగు నెలలుగా కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు .ఈ టెండర్‌పై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, సింగరేణి యాజమాన్యం పెద్ద మనసుతో వ్యవహరించి టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అప్పటి వరకు మానవతా దృక్పథంతో ఎం అండ్ ఆర్ మస్టర్ల ద్వారా తాత్కాలిక ఉపాధి కల్పించాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మక్ రిమూవల్ టెండర్ కాంట్రాక్ట్ కార్మికులు గుర్రాల శ్రీనివాస్, ఈ. రాజేష్, కే. శ్రీనివాస్, ఎస్. సాయి కృష్ణ, ఎం. కృష్ణారెడ్డి, ఎన్. రమేష్, జి. వెంకటేశ్వర్లు, ఎన్. మహేష్, కే. దుర్గాప్రసాద్, యు. సత్యం, కే. నరేష్, డి. వాసు, పి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అభ్యున్నతికి మోడీ ప్రభుత్వం కృషి

- గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి
- ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ



**జూలూరుపాడు, మహా:** మహిళా అభ్యున్నతికి మోడీ నాయకత్వంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి రమేష్ వెల్లడించారు. మంగళవారం మండల పరిధి పడమట నర్సాపురంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ఉచిత గ్యాస్ సిలిండర్లను మండల అధ్యక్షుడు భూక్య రమేష్ తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొమ్ముగూడెం, నర్సాపురం, కాకర్ల, గుండ్లరేవు, బేతలపాడు, సూరారం గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళ అభ్యున్నతికి మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందని, గ్రామీణ ప్రాంతాలలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. విబి జి రాంజీ పథకం మీద కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారలను ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, ఉపాధ్యక్షుడు ధారావత్ బాలకిషన్, యువమోర్చ అధ్యక్షుడు గూగులోత్ రాంబాబు, గిరిజన మోర్చా అధ్యక్షుడు భూక్యా రవి, కార్యదర్శి గూగులోత్ బాబూలాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ మహాత్ముడు కేసీఆర్ జన్మదిన వేడుకలు



**చర్ల, మహా:**తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ ప్రజల రాష్ట్ర జాతి పిత అపర భగీరధుడు రైతుల ఆత్మ బంధువు తెలంగాణ అభివృద్ధి ప్రధాత అయినా బీఆర్ఎస్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు చర్ల మండలం బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు మహిళలు,సర్పంచులు వార్డు నెంబర్లు కెసిఆర్ అభిమానులు కెసిఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్ డీ అజీజ్, తడికల బుల్లెబ్బాయి, గొర్ల రాజబాబు, నాగరాజు, నెర్ర బోయిన చంద్రశేఖరు, మెంతుల నరసింహారావు, అలవాల కృష్ణ, బిరబోయిన జయమ్మ, బట్ట కొమరయ్య, మామిడి రాజు, దుబ్బ సమ్మయ్య, బి. కేశవ్, రత్నాల శ్రీరామ్ మూర్తి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంబత్తిని రాంబాబు, ఎస్టీ సెల్ కార్యదర్శి కారం కన్నారావు, బీసీ సెల్ అధ్యక్షుడు గోరెంట్ల వెంకన్న, యూత్ అధ్యక్షుడు అంబోజి సతీష్, బొజ్జ సాయి ప్రణయ్ (బాచి) మహిళ ఉపాధ్యక్షురాలు సౌజన్య, సర్పంచులు జంబుల మురలీకృష్ణ, బెండబోయిన సుహాసిని, సోయం నాగలక్ష్మి, వార్డు మెంబర్లు మచ్చ రాణి, పాశగంటి సంధ్యారాణి, పలక పుష్పవతి పాల్గొన్నారు.



## నేడు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పంపిణీ చేస్తారని వలిగొండ తహసిల్దార్ దశరథ తెలిపారు.



## తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమన్నను పరామర్శించిన ఉద్యమకారులు

**భువనగిరి, మహా:**ఖమ్మం జిల్లాకు చెందిన తొలి మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమన్న ఆయన సతీమణిఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురి కావడం జరిగింది. ఇట్టి సమాచారం తెలుసుకున్న ఉద్యమకారులు మంగళవారంఖమ్మం ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించడం జరిగింది. అనంతరం సంఘటన జరిగిన పరిస్థితిని తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుల్తాన్ యాదగిరి జానకి రెడ్డి బాకారం లావణ్య వెంకటేశ్వర్లు శంకర్ జయకృష్ణ ఫక్రుద్దీన్ వెంకట్ చారి తదితరులు కలిసి పరామర్శించి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించారు



## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**మహా దుమ్ముగూడెం:** తెలంగాణ రాష్ట్ర సాధకులు మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని లక్ష్మీనగరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కో కన్వీనర్ రాముడు జాని పాషా కేక్ కట్ చేసి కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు తునికి కామేష్ బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు యూత్ కార్యదర్శి కృష్ణ పట్టణ అధ్యక్షులు అనిల్ యూత్ నాయకులు సూర్య భూపతి రాజేష్ తిరుపతిరావు సోమయ్య బాలకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రోడ్డు ఎక్కిన షాప్‌లను తొలగించాలి

**మహా దుమ్ముగూడెం:**మండల కేంద్రంలోని లక్ష్మీనగరం ప్రధాన రహదారి మీదకి వచ్చిన దుకాణాలను తొలగించాలని దుమ్ముగూడెం మండల తాహసిల్దార్ ఎం అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ రామ్ అన్నారు. మంగళవారం రోడ్డుపైకి వచ్చిన షాపులను పరిశీలించి రోడ్డుకు ఎడమ చేతి వైపు ఉన్న షాపులకు డ్రైనేజీ దాటి రహదారి మీదికి ఉండడంతో పంచాయతీ సిబ్బందితో ముగ్గు పోపించారు. డ్రైన్ దాటి లోపలికి రోడ్డు పైకి వచ్చిన షాపులన్నీ రేపటిలోగా తొలగించాలని హెచ్చరించారు. రోడ్ ఎక్కిన షాపుల వల్ల మోటార్ వెహికల్ రోడ్డు మీద ఉండటంతో అధిక రద్దీ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగరం పంచాయతీ కార్యదర్శి రోహిణి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లారీలు నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలి

**దుమ్ముగూడెం యువత, అఖిలపక్ష ఆధ్వర్యంలో రోడ్డుపై ఆందోళన.. స్పందించని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసిన ప్రజలు**




**మహా దుమ్ముగూడెం:** ఇసుక లారీలను నియంత్రించి భద్రాచలం నుండి వెంకటాపురం ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టి జరిగే ప్రమాదాలను అరికట్టాలని దుమ్ముగూడెం మండల యువత ఆధ్వర్యంలో మంగళవారం ములకపాడు క్రాస్ రోడ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఇసుక లారీల వల్ల ప్రమాదాలు గుర్రై ప్రాణాలు పోతున్నాయని అధికారులకు ప్రజాప్రతినిధులకు పట్టింపే లేదని యువత మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా లక్ష్మీ నగరం, ములకపాడు గ్రామాలకు చెందిన వ్యాపారస్తులు వారి దుకాణాలను మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. లక్ష్మీనగరం ఎస్బిఐ బ్యాంకు నుండి ర్యాలీగా బయలుదేరి ములకపాడు క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్న యువతకు అఖిలపక్ష నాయకులు, మహిళలు సంఘీభావం తెలిపి యువత చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇసుక లారీలను నియంత్రించి ప్రధాన రహదారిని నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలనే డిమాండ్ తో ధర్నా రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో భద్రాచలం చర్ల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు ఐదు గంటలు పాటు సాగిన ఈ ధర్నా రాస్తారోకో కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆగ్రహావేశాలకు లోనయ్యారు. సొంత మండల ప్రజలు రహదారి నిర్మాణం కోసం ఇసుక లారీల నియంత్రణ కోసం చేపడుతున్న నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే వచ్చి స్పష్టమైన హామీ ఇస్తే విరమింప చేస్తామని అప్పటి వరకు ఆందోళన చేపడుతామని ఆత్రుతగా ఎదురుచూసిన ఎమ్మెల్యే ఇటువైపుగా రాకపోవడంతో స్థానికులు ఆగ్రహించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అఖిలపక్ష నాయకులతో ఫోన్లో మాట్లాడి తొందర్లోనే ఈ సమస్యకు పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.స్థానిక తహసిల్దార్ ఎం. అశోక్ కుమార్, దుమ్ముగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య దీక్ష శిబిరం వద్దకు చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు మరమ్మత్తులు చేపట్టే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు దీక్షను విరమింప చేశారు. దీక్షా విరమణ తాత్కాలికమేనని త్వరలోనే రోడ్డు నిర్మాణం ప్రారంభించక పోతే మరల యువత ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని అన్నారు. ఏది ఏమైనా సమస్యను వెలిగెత్తి చూపి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో యువత కీలక పాత్ర పోషించాలని, మండలంలో జరిగే ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరూ కూడా ఇదే పోరాట స్ఫూర్తితో ప్రతి గ్రామంలోని యువత ముందుకు సాగాలని, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని యువత పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ ధర్నాకు సహకరించిన మహిళలకు, వ్యాపారస్తులకు, ప్రజలకు, పోలీస్ అధికారులకు దుమ్ముగూడెం మండల యువత తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి రాకూడదు..

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**మణుగూరు, మహా :** రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పినపాక నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం 'ప్రజాభవన్'లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, నియోజకవర్గ పరిధిలోని మణుగూరు, పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు, కర్కగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాల ఎంపీడీవోలు, ఈఈలు, డీఈలు, ఏఈలు, మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమగ్ర నీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేసి పైప్‌లైన్ల ద్వారా సరఫరాతో పాటు అవసరమైతే వాటర్ ట్యాంకర్లు, గ్రామీణ ప్రాంతాల్లో హ్యాండ్‌పంపులు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ ఎండాకాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకూడదు అని స్పష్టం చేశారు.పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల లోపాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల మరమ్మతులు, వాల్వుల సమస్యలు, పనిచేయని బోర్ పంపులు, హ్యాండ్‌పంపుల దెబ్బతినడం వంటి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. మరమ్మతులకు అవసరమైన ప్రాంతాల వివరాలు అందిస్తే నిధులు సమకూర్చే బాధ్యత తనదేనని, నిధుల కొరత పేరుతో పనులు ఆగిపోకూడదని హెచ్చరించారు. నీటి ట్యాంకులు, బోర్లు, మినీ వాటర్ సప్లై స్కీమ్స్, మిషన్ భగీరథ పైప్‌లైన్లను ప్రతి నెలా సాంకేతికంగా తనిఖీ చేసి మెయింటెనెన్స్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. వచ్చే మూడు నుంచి నాలుగు నెలలు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి సమస్యలకు వెంటనే స్పందించాలని ఆదేశించారు.



# భారీ క్రాష్ మొదలైంది.. కియోసాకి హెచ్చరిక!

**స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్న సమయంలో.. ప్రముఖ ఇన్వెస్టర్, ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి ఒక ట్వీట్ చేశారు. ఇందులో నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను అంటూనే.. భారీ క్రాష్ మొదలైందని అన్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.**

2013లో ప్రచురించిన రిచ్ డాడ్స్ ప్రాఫసీలో.. భవిష్యత్తులో అతిపెద్ద స్టాక్ మార్కెట్ క్రాష్ జరుగుతుందని హెచ్చరించాను. నేను చెప్పినట్లే.. ఆ పెద్ద ఆర్థిక సంక్షోభం సమీపంలో ఉంది. మార్కెట్ క్రాష్ అనేది కొందరికి ప్రమాదం అయినా.. స్టాక్స్ కొనుగోలు చేయాలని వేచి చూసేవారికి గొప్ప అవకాశం. ఈ సందర్భంగా కియోసాకి.. గోల్డ్, సిల్వర్ గురించి చెబుతూనే బిట్‌కాయిన్, ఎథెరియం గురించి కూడా పేర్కొన్నారు. బిట్‌కాయిన్ విలువ తగ్గిపోతున్నప్పుడు, నేను మరింత కొనుగోలు చేస్తానని అన్నారు. నా దృష్టిలో ఇవే (బంగారం, వెండి, బిట్‌కాయిన్, ఎథెరియం) నిజమైన ఆస్తులని పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభాలు ఎప్పుడూ నష్టాలనే కాకుండా.. అవకాశాలను అందిస్తుంది. భయపడే వారు నష్టపోవచ్చు, కానీ ఆర్థిక జ్ఞానం కలిగి, దీర్ఘకాల దృష్టితో పెట్టుబడులు పెట్టే వారు మాత్రం.. తప్పకుండా ధనవంతులు అవుతారు. ఎప్పుడైతే మార్కెట్ నష్టాలను చవి చూస్తుందో.. చాలామంది తమ స్టాక్ అమ్మేయడానికి సిద్ధపడతారు. అలాంటి సమయంలో వాటిని కొనుగోలు చేసేవారు సంపన్నులవుతారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. పెట్టుబడి అనేది ఒక వ్యక్తి ఆర్థిక దృష్టికోణం మాత్రమే. ఇందులో లాభనష్టాలు సహజమే. కాబట్టి ఇన్వెస్ట్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించాలి. అవసరమైతే ఆర్థిక పరిస్థితిని విశ్లేషించడం లేదా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# ఇంటెల్‌కు రూ.27 కోట్ల జరిమానా!




పోటీని దెబ్బతీసే విధానాలను పాటించినందుకు ఇంటెల్ కార్పొరేషన్‌పై కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) రూ. 27.38 కోట్ల జరిమానా విధించింది. డెస్క్‌టాప్‌లో ఉపయోగించే బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్లకు (బీఎంపీ) సంబంధించి భారత్‌కి మాత్రమే పరిమితమయ్యే వారంటీ పాలసీని వర్తింప చేయడం ద్వారా మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కంపెనీ దుర్వినియోగం చేసిందని సీసీఐ పేర్కొంది. చైనా, ఆస్ట్రేలియా, ఇతరత్రా ప్రపంచదేశాల్లో కంపెనీల పాటించే వారంటీ పాలసీలతో పోల్చినప్పుడు భారత్‌లో అమలు చేస్తున్న విధానం వివక్షపూరితమైనదని తెలిపింది. భారత్‌లోని అధీకృత పంపిణీదారు నుంచి కొనుగోలు చేస్తేనే బీఎంపీలకు వారంటీ చెల్లుబాటయ్యేలా, మిగతా ఎక్కడా లేని విధంగా ఇండియాకు మాత్రమే పరిమితమయ్యే విధంగా పాలసీని ఇంటెల్ అమలు చేయడం సరికాదంటూ మ్యాట్రిక్స్ ఇన్ఫో సిస్టమ్స్ చేసిన ఫిర్యాదుపై సీసీఐ ఈ ఆదేశాలిచ్చింది.

# ఏఐతో నిజంగా ఉద్యోగాలు పోతాయా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో అది మానవ ఉపాధిని ఏ మేరకు ప్రభావితం చేస్తుందనే అంశంపై ప్రముఖ టెక్ దిగ్గజం, జోహో వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయన్న ఆందోళనల నడుమ, ఈ సాంకేతికతను అర్థం చేసుకునే ప్రక్రియలో తాను ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ లూయిస్ గరికానో సామాజిక మాధ్యమాల్లో చేసిన ఒక విశ్లేషణాత్మక పోస్ట్‌పై స్పందిస్తూ వెంబు తన అభిప్రాయాలను పంచుకున్నారు.




### ఆటోమేషన్ అంటే ఉద్యోగం పోవడం కాదు

ఒక ఉద్యోగంలోని కొన్ని పనులను ఆటోమేట్ చేయడం అంటే, ఆ మొత్తం ఉద్యోగాన్ని ఏఐ భర్తీ చేస్తుందని అర్థం కాదని ప్రొఫెసర్ గరికానో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. చాలా ఉద్యోగాల్లో సంక్లిష్టమైన మానవ తీర్పు (హ్యూమన్ జడ్జ్‌మెంట్), సామాజిక అవగాహన అవసరమని, వీటిని ఏఐ భర్తీ చేయలేదన్నారు. సాఫ్ట్‌వేర్ ఎప్పటికీ ఆ బాధ్యతను తీసుకోలేదని, సంస్థలు మనుషుల అధికారంపైనే ఆధారపడతాయని స్పష్టం చేశారు.

### శ్రీధర్ వెంబు 'లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్'

మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీని ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తూ శ్రీధర్ వెంబు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించారు. 'ముందస్తు అంచనాలకు వెళ్లకుండా అన్ని రకాల వాదనలను (సానుకూల, ప్రతికూల) వినాలి. ప్రారంభంలో కొన్ని అభిప్రాయాలను ఏర్పరచుకోవాలి. అయితే కొత్త ఆధారాలు లభించినప్పుడు ఆ అభిప్రాయాలను వెంటనే సవరించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. కాలక్రమేణా అభిప్రాయాలు బలమైన నమ్మకాలుగా మారాలి. కానీ, ఆ నమ్మకంలోకి అహం (ఈగో) చేరకూడదు. అహం కొత్త విషయాలను నేర్చుకోనివ్వదు. కొత్త సాంకేతికతకు సంబంధించి కేవలం నమ్మకం ఉంటే సరిపోదు, దానిపై స్పష్టమైన వైఖరి ఉండాలి' అన్నారు. 'ఏఐ మా కంపెనీని, ఉద్యోగాలను ఎలా ప్రభావితం చేస్తుందనే విషయంలో నేను ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాను. దీనిపై కచ్చితమైన నిర్ణయానికి రావడానికి ఇంకా సమయం పడుతుంది' అని శ్రీధర్ వెంబు అన్నారు.

### సాంకేతికత పరిష్కరించలేని సమస్యలు

లండన్‌లో గృహ నిర్మాణ రంగంలోని సమస్యలను ఉదహరిస్తూ కేవలం ఏఐ డాక్యుమెంటేషన్‌ను సిద్ధం చేయగలదు కానీ, రాజకీయ వ్యవస్థను ఒప్పించడం లేదా సామాజిక వివాదాలను పరిష్కరించడం వంటి పనులు చేయలేదని గరికానో పేర్కొన్నారు. ఈ వాదనతో వెంబు ఏకీభవిస్తూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి కామాండ్స్ రూపొందించే ముందు ఎంతో జాగ్రత్త అవసరమని సూచించారు. మొత్తానికి ఏఐ అనేది ఒక శక్తివంతమైన సాధనం అయినప్పటికీ మానవ మేధస్సు, సామాజిక నైపుణ్యాలు, జవాబుదారీతనం అవసరమైన వైట్ కాలర్ ఉద్యోగాలకు తక్షణమే వచ్చే ముప్పేమీ లేదని ఈ టెక్ నిపుణుల విశ్లేషణ సారాంశం.



# స్టాక్ మార్కెట్ క్లోజింగ్ అప్డేట్స్

మంగళవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 173.81 పాయింట్ల లాభంతో 83,450.96 వద్ద, నిఫ్టీ 42.65 పాయింట్ల లాభంతో 25,725.40 వద్ద నిలిచాయి. యూనికామర్స్ ఈసొల్యూషన్స్ లిమిటెడ్, కొఠారి ప్రొడక్ట్స్ లిమిటెడ్, ఈజీ ట్రిప్ ప్లానర్స్ లిమిటెడ్, ఆర్చాస్ప లిమిటెడ్, కెల్టన్ టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ఇండోవిండ్ ఎనర్జీ లిమిటెడ్, కామధేను వెంచర్స్ లిమిటెడ్, సీఎల్ ఎడ్యుకేట్ లిమిటెడ్, సూపర్ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్, యుకెన్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






## టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో సెన్సేషన్‌గా అందాల ఐరా

**క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుఉన్నపుడు కేవలం ఓవర్లు పరుగులు, బాల్స్, వికెట్స్, విజయాలు, రికార్డులు మరికొంతమంది కూడా విశేషంగా మారిపోతుంటారు. రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా అవతరిస్తారు. ఇటీవల భారతదేశం, అమెరికా మధ్య జరిగిన T20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఇలాంటి విశేషమే చోటు చేసుకుంది. ఒక అందాల ముందు గుమ్మ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారిపోయింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్ 3వేల 3.77 లక్షలకు పెరిగిందంటే ఆమె క్రేజ్ ఏ రేంజ్‌లో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.**

ICC పురుషుల T20 ప్రపంచ కప్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో తళుక్కున మెరిసింది ఐరా రావత్. ఆ క్షణం ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టించింది. ఇండియా vs USA మ్యాచ్ సందర్భంగా కెమెరా ప్యాన్ అవుతూన్న సందర్భంలో ఒక యువతి వీక్షకుల దృష్టిని ఆకర్షించింది. అంతే నిమిషాల్లోనే, ఇంటర్నెట్ ఆమె ఫోటోలు, వీడియోలతో నిండిపోయింది. మ్యాచ్ రోజున ఆమె నీలం రంగు టీషర్టు, తెల్లటి షార్ట్ స్కర్ట్ ధరించి స్టేడియంలో సందడి చేసింది. ఉత్కంఠగా జరుగుతున్న మ్యాచ్ మధ్యలు ఆమె హావభావాలు మరింత ఆకర్షణీయంగా నిలిచాయి. టీమిండియా పట్ల అమె అభిమానానికి,ఆమె క్రికెట్ వైబ్స్‌కి నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఆసక్తికరంగా, తోటి క్రికెట్ ప్రేమికులతో కలిసి గ్రూప్ సెల్ఫీ తీసుకుంటున్న రావత్ ఫోటోలు కూడా వైరల్‌గా మారాయి.

### ఎవరీ ఐరా

ఇరా రావత్ నిజమైన వ్యక్తినా లేక AIజనరేటెడ్ ఐడెంటిటీనా అన్న ఊహాగానాలకు భారీగా వ్యాపించాయి. ఐరాకు క్రికెట్ అంటే చిన్నప్పటి నుండి చాలా ఇష్టమట. ఇన్‌స్టాగ్రామ్ పేజీలో, క్రికెట్ స్టేడియంలో పోజులిచ్చిన కొన్ని ఫోటోలను చూడవచ్చు. ప్రత్యక్ష మ్యాచ్‌లను చూడటానికి రావత్ తరచుగా స్టేడియాలలో వాలిపోతుంది. ముఖ్యంగా విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్‌లకు ఆమె వీరాభిమాని. నిజానికి, ఒకసారి విరాట్ కోహ్లీని వివాహం చేసుకోవాలని కోరుకుంటున్నానని కూడా చెప్పింది రావత్. విరాట్ అనుష్క శర్మను వివాహం చేసుకున్నప్పుడు రావత్ వయసు దాదాపు 18 సంవత్సరాలు. అంతేనా ఐరా రావత్ మంచి ఫ్యాషన్ ఐకాన్ కూడా. అందుకే తన బయోలో తనని తాను ఫ్యాషన్ డ్రీమర్ అని పేర్కొంది. ఫ్యాషన్ , స్టైలింగ్ పట్ల ఆసక్తి ఎక్కువట

### ఇరా రావత్ గురించి నిజం ఏమిటంటే..

ఇరా రావత్ నిజమైన వ్యక్తినా లేక AIజనరేటెడ్ ఐడెంటిటీనా అనే దానిపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ విడుదల కాలేదు. అయితే, కొన్ని AI డిటెక్షన్ టూల్స్ , డిజిటల్ విశ్లేషకులు ఆమె వైరల్ చిత్రాలను "అనుమానాస్పదంగా" ఫ్లాగ్ చేయడంతో ఇవి ఏఐమాయాజాలమే అనే ఊహాగానాలకు మరింత పెరిగాయి. AIజనరేటెడ్ కంటెంట్ వాస్తవికంగా మారుతున్న నేటి డిజిటల్ యుగంలో, అసలైన, వర్చువల్ ఐడెంటిటీల మధ్య రేఖను గుర్తించడం చాలా కష్టతరంగామారింది. అందుకే గుడ్డిగా నమ్మకుండా వినియోగదారులు ఇలాంటి ప్రొఫైల్‌స్‌ను ఫాలో అయ్యేముందు ప్రామాణికతను ధృవీకరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మరో కలకలం.. ఉమ్మెత్త పూలతో అరాచకాలు

అమెరికా వ్యాపారవేత్త, లైంగిక నేరస్థుడు దివంగత జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో తాజాగా విడుదలైన పత్రాలు తీవ్ర స్థాయిలో ప్రకంపనలు రేపుతున్నాయి. అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో వెల్లడవుతున్న అంశాలు క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తున్నాయి. భారతదేశంలోఆధ్యాత్మికతకు చిహ్నంగా భావించే మొక్కను నేరగాడు ఇంత దారుణమైన పనుల కోసం వాడిన వైనం దిగ్భ్రాంతి రేపింది. ఇటీవల విడుదలైన ఈమెయిల్స్ ప్రకారం ఎప్‌స్టీన్ ఫైల్‌స్‌లో "జోంబీ ఫ్లవర్" ప్రస్తావన బహిరంగ చర్చకు గురిచేసింది. ఎప్‌స్టీన్ తన నర్సరీలో ట్రంపెట్ ప్లాంట్స్ పెంచేవాడని తెలుస్తోంది. 2014 2015 నాటి ఇమెయిల్‌స్‌లో తన "నర్సరీలో ట్రంపెట్ ప్లాంట్లు" గురించి అడిగినట్టు, "స్కోపోలమైన్: మనిషి ఆలోచనా శక్తిని నశింపజేసే శక్తివంతమైన డ్రగ్" అనే శీర్షికతో ఉన్న సమాచారాన్ని ఎప్‌స్టీన్ ఫార్వార్డ్ చేశాడు.

**అసలేంటీ జోంబీ ఫ్లవర్**

వీటిని సాధారణంగా ఏంజెల్స్ ట్రంపెట్ లేదా డెవిల్స్ బ్రీత్ అని పిలుస్తారు. ఇది అందమైన కానీ అత్యంత విషపూరితమైన మొక్క. వీటి పుష్పాలనే జోంబీ ఫ్లవర్ అని పిలుస్తారు. ఈ మొక్క బ్రుగ్మాన్సియా లేదా డాతురా జాతికి చెందినది. దీని ప్రభావంతో జ్ఞాపకశక్తి కోల్పోవడం, పూర్తిగా పట్టు కోల్పోవడం, మగత, కొన్నిసార్లు సంఘటనలను గుర్తుకు తెచ్చుకోలేరు కూడా





**స్కోపోలమైన్ ప్రభావం**

స్కోపోలమైన్)అనేదిఈ మొక్కల నుండి తీసే మందు. దీన్నే "డెవిల్స్ బ్రీత్" లేదా "జాంబీ డ్రగ్" అని పిలుస్తారు. ఇది తీసుకున్న మనిషిపై తీవ్ర ప్రభావం ఉంటుంది. దీని ప్రభావంలో ఉన్న వ్యక్తి ఎదుటివారు చెప్పినట్లు వింటాడు, వారు అడిగినవన్నీ ఇస్తారు. ఆ తర్వాత అసలు ఏం జరిగిందో కూడా గుర్తుండదు. దీంతో ఈ డ్రగ్‌ను నేరపూరిత పనుల కోసం ఉపయోగించే అవకాశం ఉందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.

**విష స్వభావం**

ఈ మొక్కలను సాధారణంగా బ్రగ్మాన్సియా మరియు దత్తూర అని పిలుస్తారు. ఇవి పెద్ద తుత్తూరు ఆకారంలో ఉండి, చూడటానికి అందంగా ఉంటాయి. కానీ వీటి ఆకులు, పువ్వులు, గింజలు అన్నీ అత్యంత విషపూరితమైనవి. వీటిని తీసుకోవడం వల్ల తీవ్రమైన భ్రాంతులు, కండరాల బలహీనత, రక్తపోటు పెరగడం, పక్షవాతం, మరణం కూడా సంభవించవచ్చు. కొలంబియాలో దీనిని 'బురుండంగా' అని పిలుస్తారు, అక్కడ నేరస్థులు బాధితులను లొంగదీసుకోవడానికి దీనిని ఎక్కువగా వాడుతుంటారు.

**శివుడికి ప్రీతి పాత్రం**

హిందూ తత్వశాస్త్రంలో దత్తూర (ఉమ్మెత్త) చాలా భిన్నమైన అర్థాన్ని కలిగి ఉంది. ఇది శివుడికి పవిత్రమైనది. హిందూ పురాణాల ప్రకారం, ఉమ్మెత్త పువ్వులు, కాయలు పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైనవి. క్షీరసాగర మథనం సమయంలో పుట్టిన విషాన్ని (హాలాహలం) శివుడు మింగి లోకాన్ని రక్షించాడు. ఆ విష ప్రభావాన్ని తట్టుకోవడానికి ఉమ్మెత్త వంటి వన మూలికలను ఆయనకు సమర్పిస్తారని చెబుతారు. మనలోని విషపూరిత మైన ఆలోచనలను, అహంకారాన్ని దేవుడికి సమర్పించి నిర్మలమైన మనస్సును పొందాలనేది దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం.

## కండోమ్‌లు కొనడానికి డబ్బుల్లేవు

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ఈ దేశం పేరు వింటే చాలు సీమాంతర ఉగ్రవాదం, హింస, మతతత్వవాదం ఇవే గుర్తుకొస్తాయి. భారత్‌తో సమకాలీకంగా స్వాతంత్ర్యం తెచ్చుకున్న ఆ దేశం హింసనే నమ్ముకుంది. పక్క దేశాలపైకి ఉగ్రవాదాన్ని ఉసిగొలుపుతూ హింసతో ఇతర దేశాలను ఇబ్బందులకు గురి చేసే యత్నం చేసింది. ఈ నేపథ్యంలోనే ఆర్థిక అభివృద్ధిని మరచిపోయింది. ప్రస్తుతం ఆ దేశంలోని ప్రజలు కండోమ్‌లు కొనడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటే ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. పాకిస్థాన్‌కు దెబ్బమీద దెబ్బపడుతుంది. ఇటీవల భారత్, ఈయూతో చేసుకున్న ఒప్పందం వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని అక్కడి ఆర్థిక నిపుణులు హెచ్చరించారు. అక్కడి ఎగుమతులు తగ్గి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మరో వార్త ఆ దేశాన్ని కలవర పెడుతోంది. అయితే పాకిస్థాన్‌లో జనాభా నియంత్రణ లేక విపరీతంగా జననాలు జరుగుతున్నాయని తద్వారా పేదరికం సంభవిస్తుందని కనుక పేదరికాన్ని నియంత్రించాలని అక్కడి ప్రభుత్వం భావించింది. అందుకోసమే గర్భనిరోధాకాలైన కండోమ్‌ల ధర తగ్గించాలని భావించారు. అయితే ప్రస్తుతం పాక్‌కు ఐఎమ్ఎఫ్ ఆర్థిక సాయం అందిస్తుండడంతో విధాన పరమైన నిర్ణయాల్లో దాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. దీంతో ధరలు తగ్గించాలని ఐఎమ్ఎఫ్‌ను కోరగా ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఇప్పుడు పాకిస్థాన్ ఉన్న ఆర్థిక పరిస్థితుల రీత్యా పన్నులు తగ్గించడం సాధ్యం కాదని అవసరమైతే వచ్చే ఏడాది బడ్జెట్‌లో కోతలు విధించాలని తెలిపింది. దీంతో కండోమ్‌ల ధర తగ్గించలేకపోయింది. ఈ వివరాలను పాకిస్థాన్ ఆర్థిక మంత్రి ఔరంగజేబు మీడియాకు తెలిపారు. ఇటీవల ఒక సంస్థ జరిపిన సర్వేలో పాకిస్థాన్ అభివృద్ధి సాధించాలంటే ఆర్థిక వ్యవస్తలో రాజకీయ నాయకుల జోక్యాన్ని తగ్గించాలని సర్వే తెలిపింది. పాక్ జనాభా త్వరలో 40 కోట్లకు చేరుకుంటుంది. అయితే అభివృద్ధిలో ఆ దేశం వెనుకబాటులో ఉంది. ఆ దేశ మొత్తం ఐటీ ఎగుమతులు మన కేరళతో పోలిస్తే తక్కువ ఉన్నాయంటే టెక్నాలజీలో పాక్ ఏ స్థానంలో ఉందో అర్థం చేసుకోవచ్చు.





# ప్రముఖ హీరోయిన్‌కు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ

బాలీవుడ్ ప్రముఖ నటి అమీషా పటేల్‌పై మొరాదాబాద్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2017లో జరిగిన లావాదేవీలకు సంబంధించిన ఒక ఒప్పందంలో ఆమె ఉల్లంఘించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆమెకు పలుమార్లు కోర్టు సమన్లు జారీ చేసినప్పటికీ హాజరు కావడం లేదు. దీంతో తాజాగా నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయబడింది. 2017న వ్యాపారావేత్త ఆయుష్ అగర్వాల్ కుటుంబ వివాహ వేడుకలో నటి అమీషా పటేల్ ప్రదర్శన కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆమెకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ యజమాని పవన్ కుమార్ వర్మ రూ. 14.50 లక్షలు అడ్వాన్స్ కూడా ఇచ్చారు. ఆపై మొరాదాబాద్‌లోని ఢిల్లీ రోడ్‌లోని ఒక హోటల్‌లో అమీషా పటేల్ కోసం లగ్జరీ హోటల్ బుకింగ్ చేశారు. అయితే, చివరి క్షణంలో ఆమె రావడం లేదని షాకిచ్చింది. తనకు ఇచ్చిన పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చిన అమీషా. . రూ. 10 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించారని మిగిలిన రూ. 4.50 లక్షల చెక్కు తరువాత బౌన్స్ అయిందని కోర్టుకు వర్మ తెలిపారు. తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో అదనపు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్టు అమీషా పటేల్‌కు పలుసార్లు సమన్లు జారీ చేసింది. కానీ, ఆమె హాజరు కాలేదు. ఆమె హాజరును నిర్ధారించడానికి కోర్టు ఇప్పుడు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అమీషా తరపు న్యాయవాది అభిషేక్ శర్మ మాట్లాడుతూ.. ఈ వివాదం 2017 నాటిదని, ఒక ఒప్పందం ద్వారా సమస్య ఎప్పుడో క్లియర్ అయిందన్నారు. ఆమేరకు మొత్తం డబ్బును తిరిగి ఇచ్చిందని ఆయన అన్నారు.

## అమీషా పటేల్ వివరణ

ఈ విషయంపై అమీషా పటేల్ సోషల్‌మీడియా ద్వారా రియాక్ట్ అయ్యారు. 'అర్థిక లావాదేవీలకు సంబంధించి పవన్ వర్మతో సెటిల్‌మెంట్ గతంలోనే పూర్తి అయింది. ఆమేరకు డీడ్‌పై కూడా అతను సంతకం చేశాడు. తను అంగీకరించిన మొత్తాన్ని ఎప్పుడో చెల్లించాను. అయినప్పటికీ అతను తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేసినట్లు కనిపిస్తోంది. నా న్యాయవాదులు తను చేస్తున్న మోసంపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. తప్పుడు ఆరోపణలు చేయడం తను ఇప్పటికైనా మానుకోవాలి.' అని అమీషా తెలిపింది.

# ఫౌజి షూటింగ్‌లో..

వరుస పాన్ ఇండియన్ ఫిల్మ్‌స్‌తో ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రాల్లో 'ఫౌజి' ఒకటి. 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్. జయప్రద, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, భాను చందర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. టి–సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న 'ఫౌజి' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలోని ఓ కీలక సన్నివేశం కోసం గుర్రపు స్వారీ సీన్స్ తెరకెక్కిస్తుండగా అదుపు తప్పి ప్రభాస్ కింద పడటంతో చేతులకు స్వల్ప గాయాలు అయ్యాయట. ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన అభిమానులు ఆందోళన పడ్డారు. ఈ వార్తలపై ప్రభాస్ టీమ్ స్పందించింది. "ఏదైనా సినిమా షూటింగ్స్‌లో చిన్నచిన్న ప్రమాదాలు జరగడం సహజమే. ప్రభాస్‌కి పెద్ద గాయాలు కాలేదు. ఆయన చేతి వద్ద చిన్న గీటు మాత్రమే పడింది. అది కూడా చికిత్స అవసరం లేనంతగా ఉండటంతో ఆయన షూటింగ్‌లో పాల్గొన్నారు. అభిమానులు కంగారుపడొద్దు" అంటూ పేర్కొనడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే.. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో దసరా పండుగ సందర్భంగా 'ఫౌజి' విడుదల కానుంది. కాగా ప్రభాస్ చేతిలో ప్రస్తుతం 'స్పిరిట్, కల్కి 2898 ఏడీ 2' వంటి సినిమాలున్నాయి.



# ఇళయరాజాకి ఆయన పాటలపైనే హక్కు లేదు





ఇళయరాజా పేరు చెప్పగానే అద్భుతమైన పాటలు గుర్తొస్తాయి. ఇప్పుడు జోరు తగ్గిపోయింది గానీ 90స్, 20స్ టైంలో భాషతో సంబంధం లేకుండా ఎన్నో సినిమాలకు అదిరిపోయే సాంగ్స్ ఇచ్చారు. అయితే గత కొన్నాళ్ల నుంచి కాపీరైట్ పేరుతో కోర్టులో కేసులు వేస్తూ పలువురు దర్శకనిర్మాతలని ఇబ్బంది పెడుతూ వచ్చారు. వీటిలో చాలావరకు ఈయన అనుకూలంగా తీర్పులే వచ్చాయి. కానీ ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు ఈయనకు పెద్ద షాకిచ్చింది. గతేడాది 'అగత్యా' అనే సినిమా విడుదల సందర్భంగా ఇళయరాజా, ఆడియో సంస్థ 'సరిగమ'కు మధ్య వివాదం మొదలైంది. ఇదికాస్త కోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఢిల్లీ కోర్టు.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తుది తీర్పు వచ్చేంతవరకు 'సరిగమ'కు సొంతమైన 134 సినిమాల్లో పాటలని ఇళయారాజా ఉపయోగించడానికి ఏమాత్రం వీల్లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. 1976 నుంచి 2001 వరకు ఇళయరాజా స్వరపరిచిన 134 సినిమాల పాటల హక్కులని ఆయా నిర్మాతలు.. శాశ్వత ప్రాతిపదికన సరిగమ ఆడియో సంస్థకు విక్రయించారు. అయితే అందులోని కొన్ని పాటలని ఉపయోగించుకోవచ్చని.. ఇళయరాజా కొన్ని మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌కి అనుమతి ఇచ్చారు. దీంతో సరిగమ.. కోర్టుని ఆశ్రయించగా ఇప్పుడు ఇళయారాజాకు షాకిచ్చేలా తీర్పు వచ్చింది. నిర్మాత నుంచి కొనుగోలు చేసిన ఆడియో సంస్థకే సర్వ హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. వారి అనుమతి లేకుండా సాంగ్స్ ఉపయోగించడానికి వీల్లేదని పేర్కొంది. దీనిబట్టి ఇకపై సదరు పాటలపై కాపీరైట్ లాంటివి వేయడానికి ఇళయరాజాకు కుదరదు. అలానే సదరు పాటలకు ఈయనకు హక్కు లేనట్లే.



# సౌత్ హీరోయిన్లు అంటే చిన్న చూపు..

## బాలీవుడ్‌పై రెజీనా సంచలన వ్యాఖ్యలు

సౌత్ ఇండస్ట్రీకి చెందిన హీరోయిన్లలో చాలా మందికి ఒక కోరిక ఉంటుంది. ఇక్కడ స్టార్ హోదా వచ్చాకా..బాలీవుడ్‌కి వెళ్లి సత్తా చాటాలని అనుకుంటారు. సౌత్‌లో రెండు, మూడు హిట్లు పడితే చాలు.. బాలీవుడ్‌పై ఫోకస్ చేస్తారు. అలా దక్షిణాది నుంచి వెళ్లిన తారల్లో కొంతమంది బాలీవుడ్‌లోనూ రాణిస్తే.. మరికొంతమంది అవకాశాలు రాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొని తిరిగి వచ్చారు. చాన్స్‌ల సంగతి పక్కన పెడితే.. సౌత్ వాళ్లకు సరైన గౌరవం కూడా ఇవ్వరని అంటోంది నటి రేజీనా కసాండ్రా. 16 ఏళ్లకే కెరీర్‌ని ప్రారంభించిన రెజీనా.. తెలుగులో రవితేజ, గోపీచంద్, సాయిదుర్గ తేజ్, సందీప్ కిషన్ లాంటి హీరోలతో సినిమాలు చేసి మెప్పించింది. అయితే ఇక్కడ వచ్చిన గుర్తింపుతో బాలీవుడ్ ప్రయత్నాలు చేసింది. 'ఏక్ లడ్కీకో దేఖా తో ఐసా లగా' అనే చిత్రంలో ఆమె నటించింది. ఆ మూవీతో రెజీనాకు కూడా అంత పేరేమీ రాలేదు. తర్వాత మరి కొన్ని హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. ఆ సినిమా ఫలితాల సంగతి పక్కన పెడితే.. అసలు బాలీవుడ్‌కి దక్షిణాది నటీనటులు అంటే చిన్నచూపు అని.. వాళ్ల ప్రవర్తననే వెరైటీగా ఉంటుందని రెజీనా అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాల గురించి రెజీనా చెప్పుకొచ్చింది. 'బాలీవుడ్ లో నా ప్రయాణం ఊహించినంత సులభంగా సాగలేదు. హిందీ భాషపై నాకు పూర్తి పట్టు ఉన్నా, మాట్లాడటంతో పాటూ హిందీ రాయగలిగినా, వేరే సినిమాల్లో ఇతర హీరోయిన్లలాగా డబ్బింగ్ ఆర్టిస్టులను వినియోగించుకోకపోయినా బాలీవుడ్ లో నేను పూర్తిగా కలిసిపోయాననే ఫీలింగ్ కలగలేదు. సౌత్ నుంచి వచ్చిన నన్ను కొందరు వేరేలా చూశారు. నా నేపథ్యాన్ని తక్కువ చేసి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. కొందరి ప్రవర్తన, మాట తీరు అసౌకర్యానికి గురి చేసింది. అవన్నీ చూశాక నాలో ఒక రకమైన భయం మొదలైంది' అని రెజీనా చెప్పుకొచ్చింది.ఇలాంటి అనుభవం అందరికి ఎదురవుతుందని కూడా చెప్పలేమన్నారు. అంతేకాదు బాలీవుడ్ మొత్తం అలాంటిదే అని చెప్పడం కూడా కరెక్ట్ కాదని రెజీనా అన్నారు. అందరూ ఒకేలా ఉండరని, తనకు మద్దతుగా నిలుస్తూ, గౌరవించిన వాళ్లు కూడా ఉన్నారని రెజీనా చెప్పింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com